ఒకటి నుంచి నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

ఆగస్టు 1 నుంచి జిల్లా వ్యాప్తంగా 366 ఎండియుల ద్వారా 5,76,858 కార్డులకు గాను మొత్తం 17,35,767 మందికి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తారని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో జులైకిగాను 89.53 శాతం కార్డుదారులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేశారన్నారు. ప్రతి ఎండియు వాహనంలో ధరల పట్టికను ప్రదర్శించడం ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడూ ఉన్న ధరలు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆగస్టు నెలకు గాను పోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నామని, బియ్యం వద్దనుకుంటే రాగులు మూడు కిలోల వరకు ప్రతి కార్డుదారుడు ఉచితంగా తీసుకొనవచ్చునని తెలిపారు. చక్కెర అర కిలో రూ. 17 లు, అర్బన్ ఏరియాలో గోధుమపిండి కార్డుకు ఒక కిలో రూ. 16 చొప్పున ఇస్తారన్నారు. ఎవరైనా బియ్యం కార్డుదారుల వద్ద కొని బ్లాక్ మార్కెట్‌కి రవాణా చేసినా, నిల్వ ఉంచినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'ఉక్కు' ఏర్పాటయ్యే వరకూ పోరాడుతాం

- కేంద్రాన్ని నిలదీయలేని ఎంపీలు రాజీనామా చేయాలి
- కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళనలో నాయకులు

ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఆర్థికంగానూ, సాంకేతికంగానూ సాధ్యం కాదని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో హంకారపూరిత ప్రకటన చేస్తే అడగలేని వైసిపి ఎంపీలు తక్షణం రాజీనామా చేయాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగిన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అలీఖాన్, బిఎస్పీ నాయకులు గురప్ప, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, బిసి మహాసభ నాయకులు అవ్వారు మల్లికార్జున, సంఘ సేవకులు సలావుద్దీన్, జనతాదళ్ నాయకులు ప్రతాపరెడ్డి, ఎంఆర్‌ఎఫ్ నాయకులు దస్తగిరి, సిపిఎం సిపిఐ నగర కార్యదర్శులు రామమోహన్, ఎన్.వెంకట శివ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారిన కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారన్నారు. గనులు, నీళ్ల, భూములు కేటాయించినప్పటికీ బ్రాహ్మణి యజమాన్యం పరిశ్రమ ఏర్పాటు చేయకుండా కేటాయించిన గనులను కొల్లగొట్టి, నిబంధనలను అతిక్రమించి అడ్డగోలుగా దొరికి పోవడంతో పరిశ్రమ నిర్మాణం ఆగిపోయిందని పేర్కొన్నారు. నాటి యుపిఎ ప్రభుత్వం కడప ఉక్కు పరిశ్రమ రాష్ట్ర విభజన చట్టంలో చేర్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విభజన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ పార్లమెంట్ స్థానాలు తనకు ఇస్తే కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి కడప ఉక్కు పరిశ్రమ సాధిమని జగన్ అన్నారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు దాటిన విభజన హామీలపై ఏ రోజు నోరెత్తి మాట్లాడలేని చేతగాని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలైన రోడ్డు, రైల్వే, విమాన సౌకర్యంతో పాటు నీళ్ళ, కరెంటు, 27 వేల ఎకరాల భూములు కలిగి ఉన్నప్పటికీ ఇవేవీ కేంద్ర ప్రభుత్వానికి కనిపించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్ష కడప ఉక్కు నెరవేరే వరకు పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.బసురునిసా, కే.సి.బాదుల్లా, సావంత్ సుధాకర్, ఓబయ్య, ఎఐటియుసి మద్దిలేటి, లింగన్న, ఆర్ బాబు, బికెఎంయు నాయకులు మల్లికార్జున, ఎఐవైఎఫ్ దస్తగిరి, మైనుద్దీన్, నాగేంద్ర, భాగ్యలక్ష్మి, వల్లరాజు, గిరిజన సమాఖ్య శంకర్ నాయక్, బ్రహ్మం, సిపిఎం నాయ కులు పాపిరెడ్డి, చంద్రారెడ్డి, డిఎం ఓబులేసు పాల్గొన్నారు.

రహదారుల భద్రత.. సామాజిక బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్నకలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజల ప్రాణ భద్రత.. మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని తెలిపారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఇటీవల కడప–తిరుపతి ప్రధాన రహదారిలో చోటు చేసుకున్న భారీ రోడ్డు ప్రమాదం చాలా కుటుంబాల్లో విషాదాన్ని నింపిందని ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలన్నారు. అధికంగా మలుపుల వద్ద బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను ఏర్పాటు చేయాలని పోలీస్, ఇంజినీరింగ్ ఆదేశించారు. ముఖ్యంగా స్కూల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పెట్రోల్ బంకులు, కమర్షియల్ కంప్లెక్స్‌ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, బస్సులు, ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్‌డిఓలు ట్రాఫిక్ పోలీసు అధికారులు, ఎంవిఐలు, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిసిహెచ్ఎస్, మెడికల్ సూపరింటెండెంట్, ఆర్అండ్‌బి, విద్యుత్ శాఖల ఎస్ఇలు పాల్గొన్నారు.

కడప ఉక్కు సాధనకై 31న ధర్నా: సిపిఎం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం పాత బస్టాండ్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న పార్లమెంటులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) నుంచి తప్పుడు నివేదిక తెప్పించుకుని, కడప ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని ప్రకటన చేశారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉన్న రాష్ట్ర ఎంపీలు దీనిపై ప్రశ్నించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వ రంగంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మించడం లాభదాయకం కాదని చెప్పడం, మరోవైపు కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం ప్రయివేట్ జిందాల్ కంపెనీకి అప్పగించడం ఎలా లాభదాయకమవుతుందని ప్రశ్నించారు. 2014 రాష్ట్ర విభజన చట్టంలోని, రాష్ట్రపతి ఆమోదంతో పార్లమెంటులో ప్రకటించిన కడప ఉక్కు పరిశ్రమ ఇవ్వకుండా బిజెపి రాయలసీమ కరువు ప్రాంతమైన కడప జిల్లాకు ద్రోహం చేసిందన్నారు. ఈ ప్రకటనకు నాలుగు రోజుల ముందు కర్నూల్, కడపలో రాష్ట్ర బిజెపి నూతన అధ్యక్షురాలు పురందేశ్వరి కర్నూలు రాయలసీమ డిక్లరేషన్‌కు బిజెపి కట్టుబడి ఉందని, కడప ఉక్కు సెయిల్ ఆధ్వర్యంలో నిర్మిస్తామని ఇచ్చిన హామీకి భిన్నంగా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటన చేసిందని తెలిపారు. కడప ఉక్కు పై ఢిల్లీలో ఒక మాట, ఆంధ్రప్రదేశ్‌లోమరో మాట, రెండు నాలుకల ధోరణిగా బిజెపి వ్యవహరిస్తుందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కడప కలెక్టరేట్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో జరగబోవు ధర్నాకు జిల్లాలోని ప్రజలు ప్రజాతంత్ర వాదులు, యువత పెద్ద సంఖ్యలో కదిలి వచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్. సుబ్బమ్మ, ఏ.రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.పాపిరెడ్డి, వి.అన్వేష్, బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, ఓబులేసు, జమీల, రాజామణి, నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఎమ్మార్ నాయక్, ఉదయ్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఈ నెల 31 న కలెక్టరేట్ వద్ద కడప ఉక్కు సాధన కోసం నిర్వహించే ధర్నాలో ప్రతిఒక్కరు పాల్గొని జయ ప్రదం చేయాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరణాల శివ నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా రాయలసీమలో ఉన్న ఖనిజాల విలువ తెలుసుకొని వాటి కోసం అయినా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు.
బ్రహ్మంగారిమఠం : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి గాలికి వదిలేసిన బిజెపి ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సానగోవింద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదు కాదు పది సంవత్సరాలు కావాలని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతోపాటు పాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు పరుస్తామని బిజెపి హామీ ఇచ్చి నేడు మరవడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సునీల్ ,అజయ్ నాయకులు రాహుల్, రాజశేఖర్, దేవా, అరవింద్ పాల్గొన్నారు.

డిఇఒ ఆరోపణలపై విచారించాలి : ఫ్యాప్టో

ప్రజాశక్తి - కడప అర్బన్

మాట్లాడుతువన్న ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయకుమార్

ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలపై కలెక్టర్ స్పందించి విచారించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. డిఇఒ జారీచేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం యుటిఎఫ్ భవన్‌లో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హక్కులను కాలరాస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరసన కార్యక్రమాలలో పాల్గొనకూడదని డిఇఒ జారీ చేసిన ఉత్తర్వులను ఇప్పటివరకు రద్దు చేయకపోవడం దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయటానికి డిఇఒకు ఉన్న విశేషాధికారాలేమిటో స్పష్టం చేయాలన్నారు. ప్రజాస్వామ్య దేశంలో సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పాలకులతో పాటు, న్యాయస్థానాలు సైతం ఆమోదించిన విషయాన్ని గుర్తెరగాలన్నారు. ఇటీవల జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నా యన్నారు. ఉద్యోగోన్నతులు పొందిన వారికి వెంటనే రివర్సన్ ఇచ్చి వారికి అను కూలమైన స్థానాలకు కేటాయించడం, పని సర్దుబాటు కింద ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు నియమించడం, తమకు అనుకూలమైన వారికి కేటాయించడం వంటి ఆరోపణలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులను దుర్భాషలాడటం, కించపరచడం డిఇఒ స్థాయికి తగదన్నారు. చిన్న చిన్న కారణాలు చూపి నోటీసులు ఇవ్వడం, సస్పెండ్ చేయడం జిల్లాలో పరిపాటిగా మారిందన్నారు. ఈ విషయాలపై ఇప్పటికే ఆర్‌జెడి, కలెక్టర్లకు ఫిర్యాదు చేశామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆరోపణలపై విచారణ చేపట్టడంతో పాటు, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే వివాదాస్పద ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ట్రెజరర్ వై.వెంకటసుబ్బయ్య, డిప్యూటీ సెక్రటరీ జనరల్ వి.వి.వీరాంజుల రెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్షులు టి.వెంకటేశ్వర రెడ్డి, బిటిఎ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఆర్.హరి కొండయ్య, ఏపీటీఎఫ్ (257) జిల్లా నాయకులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నియామకాలపై ఫిర్యాదు చేస్తాం

కడప అర్బన్ : యోగి వేమన యూనివర్సిటీలో అక్రమ నియామకాలపై గవర్నర్, యుజిసికి ఫిర్యాదు చేస్తామని విద్యార్థి సంఘాలు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని యుటిఎఫ్ భవనంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ పద్దతిలో ప్రొఫెసర్‌గా నియామకం చెల్లదని హైకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే హైయర్ ఎడ్యుకేషన్, వైవీయూ వి సి, పాలకమండలి సభ్యులు అత్యుత్సాహంతో అదే రోజే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఈ సి సురేంద్రనాథ్ రెడ్డిని నియమించడం దారుణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి సొంత బామ్మర్ది పైన ప్రేమ ఉంటే ఏదైనా నామినేటెడ్ పోస్టు ఇచ్చుకోవాలే కాని హై కోర్ట్ తీర్పుతో ప్రొఫెసర్‌గా తొలగించాక యుజిసి నిబంధనలకు, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిబంధనలకు భిన్నంగా వెంటనే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించడం ముమ్మాటికి చట్ట వ్యతిరేక చర్య అన్నారు. ప్రొఫెసర్ హోదాలో ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కొనసాగుతున్న ఇసి సురేంద్ర నాథ్ రెడ్డిని ప్రొఫెసర్ పోస్టు నుంచి తొలగించాక కూడా అదే పోస్టులో ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. దీనిపైన ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్ర ప్రసాద్, పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారాయుడు, టిఎన్ఎస్ఎఫ్ కడప పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు పి.భరత్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, డివైఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎస్.షాకీర్ హుస్సేన్, పాల్గొన్నారు.

3న కడపకు చంద్రబాబు రాక



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప అర్బన్ : రాయలసీమలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా సిఎం జగన్ మోహన్ రెడ్డి సీమ రైతులకు తీరని ద్రోహం చేశారని , ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆగస్టు 3న కడ పకు వస్తారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గాయత్రి టవర్స్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో ప్రాజెక్టులను 75 శాతం పూర్తి చేశామని తెలిపారు. నాలుగేళ్ల వైసిపి పాలనలో మిగిలిన 25 శాతం పూర్తి చేయలేక పోయారని పేర్కొన్నారు. ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం రైతాంగానికి శాపమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాడు నీరు, ప్రగతికి రూ.2,8000 కోట్లు ఖర్చు చేయబట్టే ఇప్పుడు భూగర్భ జలాలు ఉండి, తాగునీటికి కొదవ లేదన్నారు. కేవలం రూ.100 కోట్లు ఖర్చు చేసి ఉంటే హంద్రీనీవా పూర్తయి రాయచోటి ప్రాంతాలు సస్యశ్యామలం అయ్యే వని చెప్పారు. జిఎన్ఎస్ఎస్ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందన్నారు. పులివెందుల పైడిపాలెంలో నీరు ఉన్న ఇరిగేషన్ పనులు చెయ్యక రైతులకు నీళ్లు ఇవ్వలేని పరిస్థితి అన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగి 60 మంది జల సమాధి అయ్యారని, వారి కుటుంబాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ నుంచి సహాయం అందించామని గుర్తు చేశారు.

రానున్న భారీ వర్షాలను ఎదుర్కొనేందుకు

ముందస్తు ప్రణాళిక : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రాబోవు కాలంలో భారీవర్షాలు, తూఫాన్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు. జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాలులో రానున్న వర్షాకాలంలో ముందస్తు జాగ్రత్తలు, ఏర్పాట్లు, సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్‌తో పాటు జెసి గణేష్ కుమార్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భారీ వర్షాలు, వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని చెరువులు, కాలువలు, రిజర్వాయర్ల నీటిమట్టంను ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సచివాలయాల వారీగా ఆయా పరిధిలోని నీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు 24 గంటల ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా మండలాల్లోని చెరువుల పర్యవేక్షణను సంబంధిత ఇరిగేషన్ శాఖ ఏఈలు, డిఈలు బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకు సంబంధించి వాతావరణ పరిస్థితులను బట్టి గ్రామాల్లో ప్రజలను ఎప్పటికప్పుడూ రెవెన్యూ సిబ్బంది అలర్ట్ చేయాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో మంచినీరు, పారిశుధ్యంపై జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు ఆయా మండల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్.హెచ్.ఓ.లతో పాటు.. సంబందిత శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని గామ సచివాలయ సిబ్బందిని తుఫాను సహాయక చర్యలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు.. ధర్మచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, ప్రత్యేకధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

31న కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

పంచాయతీరాజ్ నిర్వీర్యంపై ఈనెల 31న కలెక్టరేట్ వద్ద తలపెట్టే నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పార్థసారథి రెడ్డి పేర్కొన్నారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. జగన్ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధికి పంచాయతీలకు విడుదల చేసిన కేంద్ర నిధుల తో పాటు రాష్ట్ర నిధులు ఈ ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. నిరసన కార్య క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న 807 మంది సర్పంచులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొంటారన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను కాపాడుకునేందుకు నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్పొరేట్‌కు ధీటుగా వైద్య సేవలు

ప్రజాశక్తి చింతాకొమ్మదిన్నె

కార్పొరేట్‌కు ధీటుగా వైద్య సేవలందించాలని ఎన్‌క్వాస్ సెంట్రల్ టీమ్ సభ్యులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ విద్యావర్ధన్, రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం వారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులు,ల్యాబ్ టెక్నీషియన్ రూమును, వార్డులను పరిశీలించారు. వైద్యం ఎలా అందుతుందని అక్కడికి రోగులను అడిగి తెలుసుకున్నారు. వంద శాతం ప్రసవాలను స్థానిక ప్రభుత్వాస్పత్రుల్లో జరిగేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. పరి సరాలు శుభ్రంగా ఉంచుకోవడం, రికార్డులు సక్రమంగా ఉండడంతో వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్రాను ప్రశంసించారు, కార్యక్రమంలో డాక్టర్ సునీత, సిహెచ్ఒ సుకుమార్, సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆస్పత్రిని సందర్శించిన ఎన్‌క్వాస్ సెంట్రల్ టీమ్ సభ్యులు

ఇష్టపడి కష్టపడితేనే విజయం సాధ్యం

- సీడప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్థసారథి

ప్రజాశక్తి - కడప అర్బన్

శిక్షణ పొందిన యువతతో పార్థసారథి, మాట్లాడుతున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

విద్యతోపాటు ఆసక్తి ఉన్న రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొ దించుకుని క్రమశిక్షణతో ఇష్టపడి కష్టపడడం ద్వారా విజయాలు సాధ్యమవుతాయని సీడప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం కడప స్మిత్ రోడ్‌లోని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా 'డిడియుజికెవై' పథకం ద్వారా వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతతో ముఖాముఖి నిర్వహించారు. శిక్షణార్థులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదలతో కృషిచేసి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సీడప్ ద్వారా గ్రామీణ ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు, రైతులుకు, మహిళలకు ఉపాధి కల్పించి పలు వృత్తి నైపుణ్యం కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి వారి ఆర్థిక అవకాశాలను మెరుగు పరిచేందుకు చేయూతనిందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్‌అహ్మద్, సెంటర్ పార్టనర్ ముజీబ్, రీజినల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి, తేజ, గంగులయ్య, కళ్యాణి, అలీ పాల్గొన్నారు.

'నా మట్టి-నా దేశం'ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప

'మేరీ మట్టి–మేరా దేశ్ నినాదంతో ప్రభుత్వం ఈ ఏడాది నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలను జిల్లా స్థాయిలో విజయవంతం చేయాలని కలెక్టర్ వి. విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన హాలులో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల నిర్వహణపై జిల్లాలో ఏర్పాట్లు, సన్నద్ధతపై సంబందిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆగస్టు 9 నుండి 20 వరకు అత్యంత ప్రాధాన్యతతో చేపడుతున్న 'మేరీ మట్టి – మేరా దేశ్' అన్న నినాదంతో భారత ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో అమృతోత్సవ ర్యాలీలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమాల్లో భాగస్వామ్యమైన అధికారులు, ప్రజలు.. సెల్ఫీ చిత్రాలను తీసుకుని ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్ల వెబ్‌సైట్ https://yuva.gov.in/meri maati mera desh ద్వారా గానీ అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాలను గ్రామ/పంచాయితీల్లో దశలవారీగా వార్డు, పంచాయతీ సెక్రెటరీలు, ఎంపిడివోలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు.. సంబందిత శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ నోడల్ అధికారులను ఆదేశించారు.

ప్రకృతి పరిరక్షణ అందరి బాధ్యత

మొక్కలు నాటుతున్న ఇంటాక్, లయన్స్ క్లబ్ సభ్యులు, మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఇంటాక్ కన్వీనర్ లయన్ కె. చిన్నప రెడ్డి అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదం వల్ల ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్ వినియోగం, నీటి వృథా, కాలుష్యం, రసాయనాల వాడకం తదితర కారణాల వల్ల అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోకపోతే మనల్ని మనం నష్టపరుచుకున్న వాళ్ళం అవుతామని చెప్పారు. అందువల్ల ప్రతి ఒక్కరూ విధిగా ప్రకృతి పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాష మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించాలంటే అది నేటి విద్యార్థుల చేతుల్లోనే ఉందన్నారు. స్విస్ట్ కళాశాల డైరెక్టర్ చంద్రఓబుళరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణకు జాగృతి కాకపోతే మన ఆకృతి మారిపోతుందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ టూరిజం నుండి కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గురు మోహన్ రెడ్డి, కళాశాల అధ్యాపకురాలు విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. **కడప :** భూమిపై అంతరించిపోతున్న జంతువులు, చెట్లను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యా ర్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మానవుడి చర్యల వల్ల పర్యావరణం దెబ్బ తినడంతో పాటు ప్రకృతిలోని వన్యప్రాణులు తీవ్రమైన ముప్పు ఎదుర్కొంటున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పి. శివరామకృష్ణ, డాక్టర్ ఏ. నాగరాజు, డాక్టర్ వై. సావిత్రి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు పాల్గొ న్నారు. **స్టెప్ ఆధ్వర్యంలో..** ఆరోగ్యకరమైన వాతావరణం చాలా కీలకమని యోగివేమన యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్టెప్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్ధిని విద్యార్థులు దాదాపు 110 మందితో పాటు సిబ్బంది, వేణు, వెంకట సుబ్బయ్య, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, సిబ్బంది వి.వి. నారాయణ, టి. నాగయ్య పాల్గొన్నారు.

తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ఓటర్ల పరిశీలన సజావుగా సాగాలి

ప్రజాశక్తి-వేంపల్లె

ఓటర్ల పరిశీలన సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు కోరారు. శుక్రవారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ నేత మహమ్మద్ దర్బార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ ఓటర్ల జాబితా వెరిఫికేషన్, పోలింగ్ బూత్ మార్పుపై రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి మాట్లాడుతూ ఓటర్ల వెరిఫికేషన్‌కు బిఎల్‌ఒలు రావడం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పది రోజులు గడిచినా ఇంతవరకూ బిఎల్‌ఒలు ఓటర్ వెరిఫికేషన్ చేయడం లేదని విమర్శించారు. ఫోను చేసి బిఎల్‌ఒలను పిలిచినా స్పందించడం లేదని వాపోయారు. బిఎల్‌ఒల తీరుపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ఓటరు వెరిఫికేషన్ సజావుగా చేసి దొంగ ఓట్లు లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. బిఎల్‌ఒల నుండి సరైన సమాధానం చెప్పకుండా సర్వర్లు పని చేయడం లేదని చెప్తున్నట్లు చెప్పారు. 6,7 కుటుంబాలు పరిశీలించిన తర్వాత ట్రైం లేదని బిఎల్‌ఒలు అంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాత్రం జూలై 21 నుంచి ఆగస్టు 20 లోపల ఓటర్ల పరిశీలన ముగించాలని ఆదేశించినా బిఎల్‌ఒలలో మాత్రం చలనం లేదన్నారు. మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌లు దూరం మార్పు చేయడం వల్ల ఓటర్లకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. శ్రీరాం నగర్, ఇమాం నగర్, కర్రిలే రోడ్డు, బిద్దాల మిట్ట, పుల్లయ్య తోటలో నివాసం ఉంటున్న ఓటర్లకు రాజీవ్ నగర్, బాల సరస్వతి పాఠశాల వద్ద పోలింగ్ కేంద్రాలు పెట్టడంతో మూడు కిలో మీటర్లు దూరం పోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. ముస్లిం మహిళలు దూర ప్రాంతానికి వెళ్లి ఓట్లు వేయాలంటే ఇబ్బంది పడే పరిస్థితి ఉందని తెలిపారు. మరి కొందరు ఓటు హక్కును వినియోగించుకోలేక పోతున్నట్లు చెప్పారు. ఎక్కడి స్థానికులు అక్కడే వేసే పరిస్థితి ఉండేలా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. మహిళా వృద్ధులతో ఆలోచించి ఓటర్లకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల లోపు పోలింగ్ బూత్‌లు మార్చాలని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, పోతిరెడ్డి శివ, జబిబుల్లా, గొగుల మల్లికార్జున, గొటూరు నాగభూషణం, మడక శ్రీనివాసులు, పాములూరు చంటి, ఈశ్వరయ్య, వెంకటయ్య, వేమా, ఫయాజ్, మహబూబ్ షరీఫ్, వెల్డింగ్ బాష, రమేష్, ఇలియాస్ పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని సోమిరెడ్డి పాలెంలో శుక్రవారం వైభవంగా మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. హిందూ ముస్లిముల మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించుకునే పండుగ మొహర్రం. మంగళవారం నెలవంక దర్శనం ఇవ్వడంతో బుధవారం నుంచి ఉత్సవాలు మొదలయ్యాయి. కుల మతాలకు అతీతంగా మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించుకుంటారు. చంద్రవంక దర్శనం ఇవ్వడంతో ముతావలిలు పీర్ల చావిడి ముందు అలై గుంతను తీసి, పీర్ల మసీద్‌లో పీర్లను ప్రతిష్ఠించారు. హసన్, ఉసేన్‌ల నైవేద్యం సమర్పిస్తారు. మొక్కులు తీరిన వాళ్లు పీర్లకు వెండి, బంగారం గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించుకుంటారు. ఉ ఆదివారం చివరి రోజు పీర్ల వెంట అగ్ని గుండం నిర్వహిస్తారు.

పందులను గ్రామాలకు దూరంగా తరలించాలి

చెన్నూరు : స్థానిక పంచాయతీ పరిధిలోని పందులను గ్రామాలకు దూరంగా తరలించకపోతే కఠిన చర్యలు తప్పవని చెన్నూరు సర్పంచ్ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పందుల యజమానులు గ్రామాల్లో పందులను విచ్చలవిడిగా వదలడంతో అవి ఇళ్ల వద్ద దుర్గంధం చేస్తున్నాయని చెప్పారు. పరిసరాలను అపరిశుభ్రంగా చేయడంతో ప్రజలు అంటువ్యాధులు బారిన పడుతున్నారని తెలిపారు. పొలాలను సైతం నాశనం చేస్తున్నాయని రైతులు ఫిర్యాదు చేస్తున్నారని తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి పందుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చినా పద్ధతి మార్చుకోకపోవడంతో పందులు గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ వ్యాధులను వ్యాపింపజేస్తున్నాయని చెప్పారు. వెంటనే పందులను తరలించాలని లేకపోతే తాము చర్యలు చేసుకుంటామని పంచాయతీ అధికారి హెచ్చరించారు.

పచ్చదనంతోనే పర్యావరణం సాధ్యం

చక్రాయపేట : పచ్చదనంతోనే పర్యావరణం సాధ్యమవుతుందని డ్వామా పీడీ యధుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చక్రాయపేట, గండికొవ్వూరు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు నాటుతున్న మొక్కలను పరిశీలించారు. అనంతరం రైతులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గండిక్షేత్రంలో ఆయన అంజన్నను దర్శించుకున్నారు. ఆయన వెంట కార్యక్రమంలో ఎంపిపి బాలక్రిష్ణ, డివిఒ యోగాంజులు, పులివెందుల ఎపిడి సుబ్బారెడ్డి, చక్రాయపేట ఉపాధి హామీ పథకం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

పులివెందుల రూరల్ : స్థానిక మున్సిపాల్టీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం వారు మునిసిపల్ కమిషనర్ వి నరసింహారెడ్డితో కలిసి స్థానిక ఇస్లాంపురంలో పర్యటించారు. మోడల్ టౌన్‌లో భాగంగా నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షన్-2023లో ర్యాంకు సాధించడానికి చేపట్టిన కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పురపాలక సిబ్బంది ప్రజలను చైతన్య పరచి సిటిజెన్ ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనేలా చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీతో అపార అవకాశాలు

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

ఫుడ్ టెక్నాలజీతో అపార అవకాశాలున్నాయని పులివెందుల ఫుడ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డిసి డాక్టర్ ఎమ్. సర్దార్ బేగ్ తెలిపారు. పులివెందుల కళాశాలలోని కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజీ కోర్సులో చేయడానికి అప్లికేషన్స్ ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ద్వారా ఈ నెల 31 వరకు స్వీకరిస్తామని తెలిపారు. అడ్మిషన్లు సంబంధించి అప్లికేషన్ వ్యవసాయ విశ్వ విద్యాలయ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని, ఎపి ఇఎపిసి ఇటిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ కళాశాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలని కోరారు. ఈ ఫుడ్ టెక్నాలజీ కోర్సు అభ్యసించిన వారికి ఆహార అనుబంధ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, దేశంలోనేగాక ప్రపంచవ్యాప్తంగా ఈ కోర్సు అభ్యసించిన విద్యార్థిని, విద్యార్థులకు మెండుగా ఉద్యోగ అవకాశాలున్నాయని అన్నారు. మంచి జీతాలతో పాటు సుస్థిరమైన జీవితం లభిస్తుందని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్లు, ప్రభుత్వ రంగంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, పేటెంట్ ఆఫీసర్లు, ఇతర రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విభాగాలలో అవకాశాలున్నాయని తెలిపారు. విద్య పూర్తి అయ్యాక దేశ విదేశాల్లో ఎందరో తమ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులుగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల్లో వివిధ శాఖలలో స్థిరపడుతున్నారని చెప్పారు. పులివెందుల ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బిటెక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సు అందుబాటులో ఉందన్నారు. ఇంటర్మీడియట్ టెస్ట్ ప్లస్ టు పూర్తి చేసిన ఎంపిసి, బైపిసి పూర్తి చేసిన విద్యార్థులు, ఎపి ఇఎపిసిఇటి పొందిన ర్యాంకు ఆధారంగా ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఎపి ఇఎపిసి ఇటిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులు తమ కళాశాలను వెబ్ ఆప్షన్ ద్వారా ఎంపిక చేసుకోవాలని కోరారు. తమ కళాశాలలో పూర్తిస్థాయిలో ఆధునిక ప్రయోగశాలలున్నాయని అన్నారు. కళాశాలలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో విశ్వవిద్యాలయాల్లో ఫెలోషిప్‌కు ఎంపికయ్యారని ఆయన తెలిపారు మల్టీనేషన్ కంపెనీలలో మంచి జీతంతో ఉద్యోగాలు సంపాదించారని తెలిపారు.



డిసి డాక్టర్ ఎమ్.సర్దార్ బేగ్

చిగురిస్తున్న కెసి రైతుల ఆశలు

ప్రజాశక్తి - చాపాడు

శ్రీశైలం జలాశయానికి వరద నీరు క్రమంగా పెరుగుతూ వస్తూ ఉండటంతో కెసి రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. పంటలు సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి వంగడాలను సేకరించే పనిలో నిమగ్న మౌతున్నారు. గత ఏడాది జులై రెండవ వారానికి శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. ఆగస్టు మొదటి వారంలో కెసి కాలువకు నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఎగువ ప్రాంతంలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో గత వారంలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. రెండు రోజుల నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల నీటిమట్టం పెరుగుతోంది. 30వేల క్యూసెక్కుల వరకు నీరు వచ్చి చేరింది. ఈ నెల చివరకు ఆల్మట్టి, జూరాల ప్రాజెక్టులు పూర్తి స్థాయిలో నిరు చేరితే శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం పెరుగుతుందని రైతులు అంచనాలు వేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 809 అడుగులు ఉంది. ఎగువ నుండి నీటి ప్రవాహం అధికంగా ఉంటే ఆగస్టు రెండవ వారానికి కెసి కాలువకు తప్పక నీరు వస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కుందూ, పెన్నా పరిధిలో ఇప్పటికే రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై విత్తనాలు, ఎరువులు సేకరించే పనిలో పడ్డారు. సకాలంలో నీరు విడుదల అయితే కెసి, కుందూ పరిధిలో మండల వ్యాప్తంగా 16వేల ఎకరాలలో వరి పైరు సాగు అయ్యే అవకాశం ఉంటుంది.

కెసి కెనాల్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి - చాపాడు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల సమాఖ్య మహాసభను ఎపిఎం వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ గ్రామ, మండల సమాఖ్యలో ఉన్న మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా ఆర్థికంగా రాణించాలన్నారు. బ్యాంక్, స్త్రీనిధి ద్వారా పొందిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎపిఎం వెంకటరమణ మాట్లాడుతూ మండల పరిధిలో 38 గ్రామ సంఘాలలో 9749 మంది సభ్యులున్నారన్నారు. 2022 -23 ఆర్థిక సంవత్సరంలో సిఐఎఫ్ ద్వారా 18 విఒలకు రూ. 65 లక్షలు మంజూరు చేశామన్నారు. స్త్రీనిధి ద్వారా 877 మందికి రూ. 3.55 కోట్లు, బ్యాంక్ లింకేజీ ద్వారా 386 సంఘాలకు రూ. 51.17 కోట్లు, ఉన్నతి ద్వారా 19 సంఘాలకు రూ.16.79 లక్షలు, జగనన్న తోడు ద్వారా 422 మంది సభ్యులకు రూ. 42 లక్షలు అందించామన్నారు. ఆసరా ద్వారా 762 సంఘాలకు రూ. 5.35 కోట్లు, సున్నా వడ్డీ ద్వారా రూ. 1.39 కోట్లు అందివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ నాగేంద్రబాబు, సిసిలు, విఒఎలు, గ్రామసమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన సమాఖ్య మండల కమిటీ సభ్యులు

మండల సమాఖ్య అధ్యక్షురాలుగా మరియమ్మ

మండల సమాఖ్య మహాసభలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలుగా పల్లవోలు సంఘం నుంచి మరియమ్మ, కార్యదర్శిగా చియ్యపాడు నుంచి వెంకటసుబ్బమ్మ, కోశాధికారిగా కేతవరం నుంచి జీవన, ఉపాధ్యక్షులుగా నాగలక్ష్మి, ఉప కార్యదర్శిగా నాగేశ్వరమ్మను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన మరియమ్మ మాట్లాడుతూ మండల సమైక్య అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

ఆ మూడూ పిరికి పంద పార్టీలు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మన రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పిరికిపంద పార్టీలనీ పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి నెంబర్ వన్ ద్రోహి బిజెపి అన్నారు. ప్రత్యేక హోదాకు పంగనామాలు పెట్టి రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిందన్నారు. పోలవరాన్ని ప్రశ్నార్థకంగా చేసిందని తెలిపారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలు రాలేదని చెప్పారు. కడప జిల్లాలో స్టీల్ ఫ్యాక్టరీ, దుగ్గరాజపట్నంలో ఓడరేవు నిర్మాణం సాధ్యం కాదని పార్లమెంటులో చెప్పిందని తెలిపారు. 9,10 షెడ్యూల్లోని సంస్థలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు తెప్పించడంలో మోడీ ప్రభుత్వం చేతులు ఎత్తివేసినట్లు చెప్పారు. ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక నైనా విశాఖ ఉక్కు అమ్మకానికి పెట్టిందని మండిపడ్డారు. ఆంధ్రా బ్యాంకును కూడ కాల గర్భంలో కలిపిందని చెప్పారు. బిజెపి రాష్ట్రానికి ఇంత ద్రోహం చేస్తున్న ప్రాంతీయ పార్టీలైన టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు పలెత్తు మాట అనడం లేదని వాపోయారు. మోడీ, అమిత్‌షా ప్రాపకం కోసం ప్రాకులాడడం దురదృష్టకరం అన్నారు. మణిపూర్‌లో మానవ ఇతిహాసంలోనే కనివినీ ఎరుగని రీతిలో అత్యాచారాలు మరణాకాండ జరుగుతున్నాయి అన్నారు. డబుల్ ఇంజన్ పాలన ఎంత అధ్వానంగా ఉందో కనిపిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్‌తో సహ ఇండియా కుటమిలోని పార్టీలన్ని మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడితే టిడిపి, వైసిపిలు మద్దతు ఇవ్వకుండా బిజెపికి మద్దతు ఇవ్వడం సిగ్గు చేటు అన్నారు. ప్రశ్నించేందుకే జనసేన పార్టీ పుట్టిందన్న పవన్ కల్యాణ్ మణిపూర్ విషయంలో బిజెపిని ప్రశ్నించక పోవడం విడ్డూరం అన్నారు. బాబుకు, జగన్‌కు, పవన్ కళ్యాణ్‌కు ఓటు వేసినా బిజెపికి వేసినట్లే అన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మూడు పార్టీలను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తులసిరెడ్డి కోరారు.

ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేయాలి : డివైఎఫ్ఐ

ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మైలవరం మండలంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు స్థలం కేటాయించి ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలవరం మండలానికి ప్రభుత్వ ఐటిఐ కళాశాల 2015 ఏడాదిలో అప్పటి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు కళాశాల నిర్మాణానికి స్థలం కేటాయించలేదన్నారు. ప్రభుత్వాలు మారినా కళాశాల ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. మైలవరం ప్రభుత్వ ఐటిఐ కళాశాల జమ్మలమడుగులో నడుస్తోందని పేర్కొన్నారు. రెండు కళాశాలలు రెండు ఒకే చోట ఉండడంతో విద్యార్థులకు సరిపడా రూములు, ప్రాక్టికల్స్‌కు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐటిఐ లలో చేరడానికి ఇప్పటికే విద్యార్థులు శ్రద్ధ చూపుతున్నారన్నారు. మైలవరం కళాశాల నిర్మాణానికి ప్రభుత్వం బడ్జెట్ కూడా కేటాయించిందని, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంవల్ల కళాశాల ఏర్పాటు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కళాశాలకు భూమి కేటాయించి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని లేకుంటే యువజన సంఘం అధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆర్‌డిఒ స్పందిస్తూ మైలవరం ఐటిఐ స్థలం కేటాయింపు విషయంపై కలెక్టర్‌కు సిఫార్సు చేశామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఉదయ్, సూరి, రాజు, రాఘవ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

రాబోవు టిడిపి ప్రభుత్వంలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పొన్నతోట పంచాయతీలో మహిళా శక్తి ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల కోసం ప్రకటించిన పథకాలు వారి అభివృద్ధికి దోహద పడనున్నాయన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, జిల్లా వ్యాప్తంగా మహిళలకు రవాణా సౌకర్యం ఉచితం, 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకూ రూ.1500, ఇంట్లో చదువుకుంటున్న పిల్లలు ఎంత మంది ఉన్నా ఒకొక్కరికి రూ. 15 వేల చొప్పు అందజేస్తారని చెప్పారు. మహిళలకు రక్షణ చట్టం, నిరుద్యోగ భృతి, రైతులకు రూ. 20 వేల ఆర్థిక సాయం ఇస్తారని తెలిపారు. ఈ పథకాలను ప్రజలలోకి తీసుకుపోవాలనే ఆలోచనతో ప్రచారథాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పొన్నతోట శ్రీనివాసులు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి తుమ్మలూరు మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరంలో విద్యార్థులు

ప్రజాశక్తి- ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆర్మీ అటాచ్‌మెంట్ శిబిరంలో ఎన్‌సిఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రధాన ఆచార్యులు జి.చంద్రశేఖర్ ప్రదీప్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భారత త్రివిధ దళాలు ఆర్మీ, నేవి, ఎయిర్‌ఫోర్సు విభాగాలు నిర్వహించే క్యాంపులలో ఎన్‌సిసి కేడెట్లు పాల్గొని శిక్షణ పొందడం ద్వారా ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాల మీద అవగాహన పెంచుకోవచ్చన్నారు. ఈ నెల 14 నుంచి 23 వరకు సికిం ద్రాబాద్‌లో నిర్వహించిన ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో తమ కళాశాల కేడెట్లు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచారని చెప్పారు. క్యాంపులో కేడెట్లు సాయుధ శిక్షణలో వివిధ రకాలైన ఆయుధాలు, వాటి వాడకం గురించి తెలుసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి లెఫ్ట్ నెట్ మహేష్, విద్యార్థులు పవన్,అరుణ్, సమీర్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలకు 'సోలార్' వెలుగులు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

పట్టణంలోని మహనీయుల విగ్రహాలకు సోలార్ దీపాల సొగసులు అద్దనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక రాజన్న క్యాంటీన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో సైరా నరసింహారెడ్డి, బుడ్డావెంగళరెడ్డి, అంబేద్కర్, రాజీవ్‌గాంధీ, యోగివేమన, శ్రీకృష్ణదేవరాయలు ,పుట్టపర్తి నారాయణాచార్యులు, పొట్టిశ్రీరాములు, వై.ఎస్.రాజశేఖరరెడ్డి, అంబేద్కర్(పాండురంగదేవాలయం సమీపంలో), జ్యోతిరావుపూలే, వాల్మీకి, సుభాష్‌చంద్రబోస్, పాణ్యం యర్రమునిరెడ్డి, మహాత్మాగాంధీ, డాక్టర్ ప్రసాదరెడ్డి, ఎన్‌టి రామారావు విగ్రహాలున్నాయన్నారు. సామాజిక సేవాభావం కల్గిన సంస్థలు ఈ విగ్రహాల ఏర్పాటులో భాగస్వామ్యం అధికంగా ఉన్నాయని తెలిపారు. తాను పట్టణంలో తిరిగే క్రమంలో రాత్రివేళల్లో ఈ విగ్రహాలు చీకటిలో ఉండడం తనను కలచివేసిందని చెప్పారు. సమాజ అభ్యుదయం కోసం అన్నిటినీ త్యాగం చేసిన మహనీయుల విగ్రహాలు ఎప్పుడూ వెలుగులో ఉండాలనే ఉద్దేశంతో తన సొంత నిధులు రూ.6 లక్షలు ఖర్చుచేసి సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మహనీయుల జీవితాలు మనకు భావితరాల వారికి స్ఫూర్తిదాయం కావాలన్నారు. రాజకీయాలకతీతంగా అన్ని విగ్రహాలకు సోలార్ దీపాలంకణ చేశామని తెలిపారు. అనంతరం సోలార్ లైట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిట్టా బాలాజీ, మున్సిపల్ ఇంజనీర్, సహాయ ఇంజినీర్ పాల్గొన్నారు.

ప్రకటన

కడప జిల్లా, పులివెందులలో వెలసిన శ్రీ రంగనాథ, శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి దేవస్థాన ములకు సంబంధించి 12 నెలలకు నిత్యం పూలు, దండలు ఇచ్చుటకు మరియు నూలు పూజ 9 రో॥ బ్రహ్మోత్సవాలు 9 రోజులు సరఫరా చేయుటకు, మరియు ఆహ్వాన పత్రికలు, బుక్‌లెట్లు ప్రింటింగ్ చేయుటకు, పై ఉత్సవాలకు విద్యుత్ అలంకరణ, పైపుల పందిరి వేయుటకు క్రింద తెలిపిన అడ్రసుకు కొటేషన్స్ ఇవ్వవలసినదిగా కోరడమైనది. మరిన్ని వివరాలకు కార్యనిర్వహణాధికారిని సంప్రదించగలరు.

సి.సుధీకర్ రెడ్డి
చైర్మన్

కె.వి.రమణ
కార్యనిర్వహణాధికారి

సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజల వద్దకే ప్రభుత్వం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- దువ్వూరు

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చిందని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణంపల్లి సచివాలయ పరిధిలోని సచివాలయం, ఆర్‌బికె, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే అన్ని సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. ప్రజల్లో సిఎం జగన్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక టిడిపి, జనసేన పార్టీలు వాలంటరీ వ్యవస్థపై విమర్శలు చేస్తున్నాయని పేర్కొన్నారు. 2024 ఎన్నికలలో టిడిపి, జనసేన భూస్థాపితం అవ్వడం ఖాయ మని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో వైసిపి సమన్వయ కార్యకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, జడ్‌పిటిసి కృష్ణయ్య, మండల నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందిపై ఎంపిడిఒ మండిపాటు

పోరుమామిళ్ల : మండల ఎంపిడిఒగా బాధ్యతలు తీసుకుని నెలరోజులైనా వెలుగు సిబ్బంది అభివృద్ధి పనులపై చర్చింకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపిడిఒ చంద్రమౌళి వారిపై మండిపడ్డారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆకస్మికంగా వెళ్లి వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాగైతే అభివృద్ధి పనులు ఎలా ముందుకు సాగుతాయని ప్రశ్నించారు. మండలంలో ఏయే అభివృద్ధి పనులు జరుగుతున్నాయో, ప్రజలకు లబ్ధి చేకూరుతుందో లేదో తెలుసుకోవాల్సిన బాధ్యత తనకున్నదని పేర్కొన్నారు. ఒక మండల అధికారిని కూడా కలవడం తీరిక లేదా అని, మండలంలో ప్రజలకు ఏమేమి అభివృద్ధి పనులు చేస్తున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని, జిల్లాస్థాయి అధికారులు వచ్చినప్పుడు తన వద్ద వెలుగుకు సంబంధించిన సమాచారం లేకపోతే తాను ఏమి సమాధానం చెప్పగలని తెలిపారు. ఇప్పటికైనా వెలుగు సిబ్బంది తీరు మార్చుకొని వెలుగు సిబ్బంది కలిసి పని చేయాలని ఆయన సూచించారు. లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

ఆర్ఇఎస్ఎస్‌విలో ప్రపంచ పులుల దినోత్సవం

ఖాజీపేట : స్థానిక రవీంద్ర ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్లోబల్ టైగర్స్ డే కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా విద్యార్థులకు పులుల ఆవశ్యకత గురించి వివరించారు. అటవీ వన్య ప్రాణుల సంరక్షణ కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, రెయిన్‌బో పాఠశాల కరెస్పాండెంట్ తవ్వా సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు, అటవీ శాఖ అధికారులు రవిచంద్ర, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం

జమ్మలమడుగు : పట్టణంలోని క్యాంబెల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎం.సుబ్బరాయుడుకు గుండె ఆపరేషన్ కోసం రక్తం అవసరం కాగా వారు వెంటనే మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే.లక్ష్మణ్ రావును ఫోన్ ద్వారా సంప్రదించారు. వెంటనే స్పందించి జమ్మలమడుగుకు చెందిన సురేష్ అనే వ్యక్తి చేత ఓ పాజిటివ్ రక్తదానం చేయించారు. అడిగిన వెంటనే రక్తదానం చేసిన దాతలను చైర్మన్ అభినందించారు.

17 నుంచి గండిలో శ్రావణ మాసోత్సవాలు

ప్రజాశక్తి - చక్రాయపేట

పవిత్ర పుణ్యక్షేత్రమైన గండిక్షేత్రంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15 సెప్టెంబరు వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు టిటిడి అనుమతి ఇచ్చిందని ఆలయ ఇఒ అలవలపాటి ముకుందారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తిరుమల -తిరుపతి దేవస్థానముల వ్యయంతో షెడ్లు, స్టేజీ, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. 70 అలాగే మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయవలసిందిగా తిరుపతి పరిపాలన భవనంలో టిటిడి ఇఒ ధర్మారెడ్డిని కలిసి కోరామన్నారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోని ఈ క్షేత్రానికి లక్షలాదిమంది భక్తులు వస్తారని, కడప పార్లమెంట్ సభ్యులు వై.ఎస్ అవినాష్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఆయన తెలియజేశారు. స్పందించిన టిటిడి ఇఒ వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సత్వర ఏర్పాట్లు చేయవలసిందిగా ఆదేశించారని ఆలయ ఇఒ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

టిటిడి ఇఒతో మాట్లాడుతున్న గండి ఆలయ ఇఒ ముకుందారెడ్డి

క్రీడలతో మానసిక ఉల్లాసం

పులివెందుల టౌన్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని అంబకపల్లి రోడ్డు ఆంధ్ర ఫిష్ మార్కెట్ వెనుక వైసిపి చెందిన నాగేంద్ర రెడ్డి, మదన్మోహన్ రెడ్డి, సుమంత్ రెడ్డి, మహమ్మద్ అలీ ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి , రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి వై.ఎస్ అభిషేక్ రెడ్డి, పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి , మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిన్నప్ప , వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ వసూళ్ల కౌంటర్లు పనిచేస్తాయి

ప్రొద్దటూరు : శని, ఆదివారాలలో (నేడు, రేపు) ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలోని విద్యుత్‌ఛార్జీల వసూళ్ల కేంద్రాలు పనిచేస్తాయని విద్యుత్ డిఇ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వసూళ్ల కేంద్రాలలోని కౌంటర్లు యధావిధిగా పనిచేస్తాయని వినియోగదారులు విద్యుత్ బిల్లులను చెల్లించి సంస్థకు సహకరించాలని కోరారు.

రాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

I.A.No. /2023
O.S.No. 69/2023

1. డి.రామక్రిష్ణయ్య
2. డి.రామానాయుడు ...పిటిషనర్లు/వాదులు

Vs

1. కూండ్ల రాజగోపాల్‌రెడ్డి & 5 ఇతరులు. ...రెస్పాండెంట్లు/ప్రతివాదులు

పై దావాలో 4వ ప్రతివాదికి పత్రికాముఖముగా నోటీసు

To,
R4. సోదినపల్లె వెంకటరెడ్డి, S/o ఎస్.వెంకటసుబ్బారెడ్డి, డోర్‌నెం.1/21, వెలుగుపల్లె గ్రా॥, సిద్ధవటం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా. ఆధార్‌నెం.5355 4625 8194.

అను మీరు 4వ రెస్పాండెంటు/D4 గా మరియు ఇతరుల మీద, పిటిషనర్స్, మీ మీద పిటిషన్ షెడ్యూల్ ఆస్థిపై పర్మనెంట్ ఇంజక్షన్ కోరుచూ పై I.A.ను సలుపగా సదరు I.A. మీ యొక్క హాజరుకు గాను 22.8.2023వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 22.8.2023వ తేదీ ఉ.గం॥10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఆక్షేపణలు/ అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

తేది: /7/2023

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
కె.చంద్రమోహన్
వకీలు, కడప.

రాజశ్రీ 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి : కడప వారి కోర్టులో

O.S.No. 69/2023

1. డి.రామక్రిష్ణయ్య
2. డి.రామానాయుడు ...వాదులు

Vs

1. కూండ్ల రాజగోపాల్‌రెడ్డి & 5 ఇతరులు. ...ప్రతివాదులు

పై దావాలో 4వ ప్రతివాదికి పత్రికాముఖముగా సమను

To,
D4. సోదినపల్లె వెంకటరెడ్డి, S/o ఎస్.వెంకటసుబ్బారెడ్డి, డోర్‌నెం.1/21, వెలుగుపల్లె గ్రా॥, సిద్ధవటం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా. ఆధార్‌నెం.5355 4625 8194.

అను మీరు 4వ ప్రతివాదిగా మరియు ఇతరుల మీద, వాదులు, మీ మీద దావా దాఖలా ఆస్థిపై పర్మనెంట్ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పై దావాను సలుపగా సదరు దావా మీ యొక్క హాజరుకు గాను 22.8.2023వ తేదీకి వాయిదా వున్నది. కావున సదరు 22.8.2023వ తేదీ ఉ.గం॥10.30 ని॥లకు మీరు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ రాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఆక్షేపణలు/ అభ్యంతరాలు వన్న యెడల కోర్టు వారికి తెలపుకోనంతట, పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

తేది: /7/2023

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
కె.చంద్రమోహన్
వకీలు, కడప.